నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, గురువారం 7 నవంబర్ 2024 | KARIMNAGAR

# కాంగ్రెస్‌ది అప్రజాస్వామిక పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

- ప్రశ్నిస్తే దాడులకు దిగుతారా..?
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- జమ్మికుంటలో చేప పిల్లల పంపిణీ
- ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకున్న హస్తం శ్రేణులు
- బీఆర్ఎస్ శ్రేణులతో వాగ్వాదం.. రసాభాస

జమ్మికుంట (హుజూరాబాద్ టౌన్), నవంబర్ 6: ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నదని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం జమ్మికుంట గుండ్ల చెరువులో చేపపిల్లలు విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతుండగా, హస్తం నేతలు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను దూషిస్తూ రెచ్చిపోయారు. వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు రంగప్రవేశం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో పంపిణీ చేసిన ఉచిత చేప పిల్లల్లో సగం కూడా ప్రస్తుత సర్కారు పంపిణీ చేయడం లేదన్న విషయాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోయారని, దాడులకు దిగారని, ఇదేం సంస్కృతి అని ఆక్షేపించారు. ఎవరికీ భయపడేది లేదని, మత్స్యకారుల తరపున పోరాటం చేసి వారికి న్యాయం జరిగేలా చూస్తానని స్పష్టం చేశారు. పూర్తిగా నాసిరకం, అతిచిన్న చేపపిల్లలను చెరువుల్లో పోస్తున్నారని, ఇలా అయితే అవి ఎదిగేది ఎప్పుడు? మత్స్యకారులకు ఉపాధి దొరికేదెన్నడు? అని ప్రశ్నించారు. పంపిణీని ఆలస్యం చేయడమేకాకుండా వారి చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు తమపై లేనిపోని నిందలు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌పాలనపై మత్స్యకార కుటుంబాలు దుమ్మెత్తి పోస్తున్నా చీమ కుట్టినట్లయినా లేకపోవడం సిగ్గుచేటన్నారు. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ మత్స్యరంగం దారుణ వివక్షకు గురైతే, కేసీఆర్ పదేళ్ల పాలనలో మత్స్య రంగాన్ని అభివృద్ధి చేసి దేశానికి ఆదర్శంగా నిలిపారని గుర్తు చేశారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మాని చేపపిల్లల పంపిణీపై దృష్టి సారించాలని, లేదంటే మత్స్యకార కుటుంబాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్, అబాది జమ్మికుంట కౌన్సిలర్లు దయాల శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# డిమాండ్లు నెరవేర్చాలని పంచాయతీ కార్మికుల దీక్ష




తెలంగాణచౌక్, నవంబర్ 6: తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాల్సిందేనని గ్రామ పంచాయతీ కార్మికులు స్పష్టం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బుధవారం దీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 51 జీవో సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# గురువులూ ఇవేం చేష్టలు?

## బోధన వృత్తికి మచ్చ తెస్తున్న పలువురు పంతుళ్లు

- పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించి నవ్వులపాలు
- ఇటీవలి కాలంలో పెరిగిన పోక్సో కేసులు
- మకిలి అంటిన వారిలో ఎక్కువ మంది వయసు నలభై ఐదు పైనే..
- విద్యా సంస్థల్లో 'అతి'పై నిఘా కమిటీలు ఉండాలంటున్న నిపుణులు
- ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలని సూచనలు



జగిత్యాల, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయులంటే సమాజానికి ఆదర్శంగా ఉండేవారు. విద్యాబుద్ధులతో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేవారు. కానీ, కొందరు టీచర్లు తమ వక్రబుద్ధిని బయటపెడుతున్నారు. తమ చేష్టలతో ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెస్తున్నారు. తమ వయసును సైతం మరిచిపోయి మనుమరాళ్ల వయసులో ఉన్న చిన్నారులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ మాయని మచ్చను వేసుకుంటున్నారు. అభంశుభం తెలియని అమ్మాయిలపై చేతులు వేస్తూ.. శరీరాలను తాకుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. చివరకు అడ్డంగా దొరికిపోయి కేసుల పాలవుతున్నారు. కొందరు సస్పెండ్ కూడా అవుతున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువగా కనిపిస్తుండగా, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. ఆడపిల్లల క్షేమం దృష్ట్యా కొన్ని ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెబుతున్నారు.

➲ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఒక బాలికల కళాశాల అది. అక్కడ రాష్ట్ర సరిహద్దుగా ఉన్న ఒక జిల్లా నుంచి వచ్చిన ఒక ఉపన్యాసకుడు విధులు నిర్వర్తిస్తున్నాడు. నలభై ఏండ్లకు పైబడి వయసున్న సదరు ఉపన్యాసకుడు మొదటి నుంచి అమ్మాయిలతో అదో రకంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అవసరం లేకున్నా తాకడం, చేతులు వేయడం ఆరంభించాడు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఒక గ్రామానికి చెందిన విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. దుర్మార్గమైన ఆలోచనను పసిగట్టిన అమ్మాయిలు, అతడిని అసహ్యించుకోవడం మొదలుబెట్టారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పాలో అర్థం కాక కొన్నాళ్లు ఓపిక పట్టారు. ఉపన్యాసకుడి చేష్టలు శ్రుతిమించడంతో విద్యార్థిని తన ఇంట్లో చెప్పింది. ఆగ్రహానికి గురైన విద్యార్థిని తల్లిదండ్రులతోపాటు బంధువులు కాలేజీకి చేరుకొని సదరు ఉపన్యాసకుడిని ప్రశ్నించారు. అతడు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో చేయి చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లేందుకు సిద్ధపడ్డారు. దీంతో సదరు ఉపన్యాసకుడు అప్రమత్తమై, బాధిత విద్యార్థినితోపాటు ఆమె తల్లి కాళ్లను విద్యార్థుల ముందే మొక్కి క్షమించాలని వేడుకోవడంతో సమస్య సద్దుమణిగింది.

➲ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఒక మండల జూనియర్ కాలేజీలో పనిచేసే ఇద్దరు ఉపన్యాసకులు కాలేజీ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించారు. అమ్మాయిల ఫోన్‌లకు అసభ్యకరమైన మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడంతోపాటు కాలేజీలో అసభ్యంగా ప్రవర్తించడంతో పిల్లలు, వాళ్ల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక లెక్చరర్ కొన్నేళ్లుగా అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్టు తెలిసింది. 'హోంవర్క్ ఎందుకు చేసుకురాలేదు? రాత్రి బాగా బిజీనా.. ఎప్పుడు మాస్క్ వేసుకొనే ఉంటవా.. కండ్లే కనిపిస్తున్నయి. అన్నీ చూడాలె. మాస్క్ తీయు' ఇలాంటి కామెంట్లు చేయడంతోపాటు అమ్మాయిల సెల్‌ఫోన్లకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నారని పిల్లలు ఆరోపించారు. విషయం తల్లిదండ్రుల వరకు చేరడంతో వారు కాలేజీకి వచ్చి ప్రిన్సిపాల్, లెక్చరర్లతో ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు, పోలీసులు విచారణ ప్రారంభించగా, నలుగురు అమ్మాయిలు వాగ్మూలం ఇవ్వడంతో సదరు లెక్చరర్‌పై పోక్సో సెక్షన్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, అందులో ఓ లెక్చరర్ వయసు యాభైకి పైగా ఉండడం గమనార్హం.

➲ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఒక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా వ్యవహరించారు. చేతులు వేయడం, శరీరాన్ని తాకుతుండడంతో విద్యార్థినులు తమ ఇంట్లో చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఒక టీచర్‌కు దేహశుద్ధి చేశారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేశారు. వారిపై పోక్సో కేసు కూడా నమోదు చేశారు. ఒక టీచర్ రిమాండ్ కాగా, మరో ఉపాధ్యాయుడు ఇంకా అబ్‌స్కాండింగ్‌లోనే ఉన్నాడు. కేసులో ఇరుక్కున్న ఇద్దరి వయసు సైతం నలభై ఐదుకు పైగానే ఉండడం గమనార్హం.

➲ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడిది మరో మూడు నెలలు అయితే ఉద్యోగ విరమణ పొందే సమయం. ఈ వయసులో పోక్సో కేసు బారిన పడి రిమాండ్‌కు వెళ్లాడు. మారిన సాంకేతిక నైపుణ్యాల నేపథ్యంలో విద్యార్థుల హాజరు నమోదుతోపాటు పిల్లల చదువు, ప్రగతి వివరాలను ఇంటికి చేరవేసే వరకు అన్నింటికీ సెల్‌ఫోన్ అవసరమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రతి ఉపాధ్యాయుడికి ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు తెలిసిపోతున్నాయి. కాగా, కొందరు ఉపాధ్యాయులు ఆ నంబర్ల ద్వారా పిల్లలకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సదరు ఉపాధ్యాయుడు అలాగే వ్యవహరించి పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రిటైర్మెంట్‌కు మరో ఆరు నెలల దూరంలో ఉన్న ఉపాధ్యాయుడిపై సైతం ఇలాంటి ప్రవర్తనతోనే పోక్సో కేసు నమోదైంది.

➲ కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన ఉపాధ్యాయుడు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్నాడు. ఆయన ఇటీవల తన ఇంటి సమీపంలో ఉండే బాలికను లైంగికంగా వేధింపులకు గురి చేశాడు. దీంతో ఆ బాలిక తల్లికి చెప్పడంతో ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి, పోక్సో కేసు నమోదు చేశారు. మూడు నాలుగు రోజుల క్రితం విధుల నుంచి సస్పెండ్ చేశారు.

- ♦ విద్యా సంస్థల్లోని మహిళా టీచర్లు, ఉపన్యాసకులు, స్టాఫ్‌మెంబర్లు, విద్యార్థినులతో ఒక కమిటీని రూపొందించాలి.
- ♦ కమిటీ ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి సమావేశం కావాలి. దీనికి సంస్థ పర్యవేక్షకులు హాజరుకావాలి.
- ♦ ఆడపిల్లలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. ఇంటికి వెళ్లి చెప్తే చదువు మాన్పించే ప్రమాదం ఉండడంతోపాటు ఎలా స్పందిస్తారోనన్న విషయమై ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యా సంస్థల్లో రెండు మూడు చోట్ల ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలి. దీని తాళంచెవులు ప్రధాన పర్యవేక్షకుడి వద్ద ఉండాలి. కనీసం వారానికి ఒక్కసారి బాక్సులను విప్పి ఫిర్యాదులను పరిశీలించాలి.
- ♦ పోక్సో చట్టంపై పాఠశాల, కళాశాలల్లో పిల్లలకు అవగాహన కల్పించాలి. అమ్మాయిలతోపాటు అబ్బాయిలకు అవగాహన రావాలి. ఇబ్బంది అయితే ఫిర్యాదు చేసేలా అమ్మాయిలకు ధైర్యం చెప్పాలి. తప్పు చేస్తే పడే శిక్షపై అబ్బాయిలకు తెలపాలి. పాఠశాలల్లో పోక్సో చట్టంలోని అంశాలన్నింటినీ వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ♦ అసభ్యకరమైన సైగల నుంచి మొదలు కొని ప్రవర్తన కింద వచ్చే అన్ని చర్యలు, వాటి శిక్షలపై అవగాహన కల్పించాలి.
- ♦ ప్రతి విద్యా సంస్థల్లో పిల్లలకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలి. అలాగే ఆడపిల్లలకు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించే విషయాన్ని పరిశీలించాలి.
- ♦ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తరగతి గదుల్లో సీసీ కెమరాలు ఏర్పాటు చేసి, వాటిని స్టాఫ్‌రూం, పర్యవేక్షకుడి గదికి, అవసరమైతే పర్యవేక్షుడి సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేయాలి.
- ♦ పర్యవేక్షకులు వీలైనప్పుడల్లా సీసీ కెమెరాల్లో ఉపాధ్యాయులు, పిల్లల వ్యవహారశైలిని పరిశీలించాలి.
- ♦ ప్రతి తరగతి గది విద్యార్థులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ప్రధానోపాధ్యాయులు, పర్యవేక్షకులు భాగస్వామ్యం కావాలి. వాటిపై సైతం వారి పర్యవేక్షణ ఉండాలి.

# ధాన్యం సేకరణలో వేగం పెంచాలి



జిల్లెల్లలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ • కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో విస్తృత పర్యటన
- కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ
- పలుచోట్ల సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

సిరిసిల్ల రూరల్, నవంబర్ 6: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. బుధవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల, నేరెళ్ల, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు, మల్యాల మండలం రామన్నపేటలో కలెక్టర్ బీ సత్యప్రసాద్‌తో కలిసి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో ధాన్యం కుప్పలు, తేమ శాతం, కాంటా వేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కేంద్రాల నుంచి తరలించి ధాన్యం బస్తాలపై సెంటర్ పేరు సరిగ్గా కనిపించేలా ముద్ర వేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు ముందుకువచ్చే రైస్‌మిల్లర్లకు కేటాయించాలని సూచించారు. ఎవరూ ముందుకురాకపోతే ప్రత్యామ్నాయంగా ఉన్న గోదాములకు తరలించాలని ఆదేశించారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే పత్తి పండించిన రైతులు తమ పరిధిలోని కేంద్రాలకు పంట ఉత్పత్తులను తరలించాలని సూచించారు. ఇక్కడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాభాయ్, తంగళ్లపల్లి తహసీల్దార్ జయంత్‌కుమార్, మెప్మా డీఎంసీ రాజేశం, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

# వైద్య వృత్తి పవిత్రమైనది

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఐఎంఏ నూతన కార్యవర్గ సమావేశం




మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యానగర్, నవంబర్ 6 : వైద్య వృత్తి పవిత్రమైనదని, దేవుడితో సమానంగా చూస్తారని, ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కరీంనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన నూతన ఐఎంఏ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సామాజిక బాధ్యతగా వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలందించాలన్నారు. కరీంనగర్‌ను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. జిమ్‌కు ₹10 లక్షలు కేటాయిస్తానని, అలాగే ఐఎంఏ హాల్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తానన్నారు. అంతకు ముందు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు ఎనమల్ల నరేశ్, శ్రీపురం నవీన్‌కుమార్, కోశాధికారి చల్లూరి విజయ్‌కుమార్‌తో కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు గాలి ప్రసాద్, శ్యాంసుందర్, బీఎన్‌రావు, నూతన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు (ఎలెక్టెడ్) కిషన్, వైద్యులు ఎడవెల్లి విజయేందర్ రావు, వసంతరావు, విజయమోహన్‌రెడ్డి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి, వాసుదేవ శ్రీనివాస్, రాంకిరణ్, అలీం, రమణచారి, వెంకట్‌రెడ్డి, బంగారి రజనిప్రియదర్శిని, ఆది శ్రీదేవి పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా ఎలా రికవరీ చేస్తరు?

- గుడి కమిటీ పేరిట చందా వసూళ్లపై సింగరేణి కార్మికుల ఆగ్రహం
- తిరిగి ఇవ్వాలని అధికారులకు లేఖలు



రికవరీ చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్‌కు జీడీకే 2 గనికి చెందిన కార్మికుడు గంగారపు లింగమూర్తి రాసిన లేఖ

గోదావరిఖని, నవంబర్ 6: సింగరేణి సంస్థలో గుడి కమిటీల పేరిట గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చందా వసూళ్లపై కార్మికులు కన్నెర్రజేస్తున్నారు. అనుమతి పత్రాలు లేకుండా కార్మికుల బోనస్ నుంచి ₹500 చొప్పున రికవరీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ, తీవ్రస్థాయిలో ఆగ్రహిస్తున్నారు. ఈ విషయం లో యాజమాన్యం స్పందించాలని, వివరణ ఇవ్వాలని కార్మిక సంఘాలు, కార్మికులు ప్రశ్నిస్తున్నారు. రికవరీ చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతూ సింగరేణి ఉన్నతాధికారులకు లేఖ రాస్తున్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా జీడీకే 2గనికి చెందిన గంగారపు లింగమూర్తి అనే కార్మికుడు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్‌కు లేఖ రాశాడు. ఒక ప్రొ ఫార్మా తయారు చేసి అనుమతి లేకుండా కార్మికుల బోనస్ నుంచి కట్ చేసిన ₹500 తిరిగి చెల్లించాలని కోరాడు. లింగమూర్తి ఒక్కరే కాదు సింగరేణి వ్యాప్తంగా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేసేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు. కాగా, గుడి కమిటీ పేరుతో ఉన్న 1840 రికవరీ కోడ్ ద్వారా రామగుండం రీజియన్‌కు చెందిన 4,417మంది కార్మికుల నుంచి ₹22లక్షల 8వేల 500 రికవరీ చేశారని, ఇది సరికాదని రామగుండం డివిజన్ 1 సీఐటీయూ నాయకుడు మెండే శ్రీనివాస్ మండిపడ్డారు. రికవరీ చేసిన డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాలోకి పంపించాలని డిమాండ్ చేశారు. మరోవైపు మిగతా కార్మిక సంఘాల నాయకులు కూడా కార్మికుల డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ మాత్రం ఈ విషయంలో స్పందించడం లేదు.



# ప్రమోషన్లు వచ్చినా పాత కొలువే!

- దేవాదాయ శాఖలో వింత పరిస్థితి • అధికారులు, ఉద్యోగుల్లో ఆవేదన
- పట్టించుకోని సర్కారు

వేములవాడ, నవంబర్ 6: దేవాదాయశాఖ పాలన గాడితప్పింది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. ఉద్యోగులకు శాపంగా మారుతున్నది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్లుగా ఇటీవల రాష్ట్రంలోని పలు ఆలయాలు యూనిట్‌గా అధికారులు, ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించినా, ఆయా స్థానాల్లో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో పాత కొలువులే చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఫలితంగా సర్వీస్ రూల్స్ ప్రకారం వచ్చే బెనిఫిట్స్ నష్టపోతుండగా, ఇప్పటికైనా ప్రభుత్వం, ఎండోమెంట్ అధికారులు స్పందించాల్సి ఉన్నది. రాష్ట్రంలోని వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, బాసర, కొమురవెల్లి ఆలయాలను యూనిట్‌గా చేసుకొని గత ఆగస్టులో దేవాదాయశాఖ ఉద్యోగ బదిలీలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే బదిలీ అయిన ఉద్యోగుల్లో కొందరికి సీనియారిటీ ప్రకారం మాతృ సంస్థ ఆలయాల్లో ప్రమోషన్లు పొందినా ఆయా స్థానాల్లో పోస్టింగులు ఇవ్వకపోవడంతో పాత ఉద్యోగాలే చేస్తూ ఆవేదన చెందుతున్నారు.

### ఉద్యోగోన్నతి వచ్చినా..

ఇటీవల జరిగిన బదిలీల్లో వేములవాడ ఆలయ ఏఈవో ప్రతాప నవీన్ యాదగిరిగుట్టకు బదిలీ అయ్యారు. అక్కడే ఏఈవోగా ఉద్యోగం చేస్తున్నారు. అయితే నవీన్‌కు వేములవాడ ఆలయం మాతృ సంస్థ కావడంతో సీనియారిటీ ప్రకారం ఇక్కడ డిప్యూటీ కార్య నిర్వహణ అధికారి(డీఈవో)గా ఉద్యోగోన్నతి వచ్చింది. అయితే జీవో 888 ప్రకారం బదిలీ అయిన ఉద్యోగులకు ఒకవేళ వారి మాతృ సంస్థలో పదోన్నతి వస్తే అదే పోస్టును ప్రస్తుతం పనిచేసేచోట ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ అక్కడ పోస్టు ఖాళీగా లేకపోతే తిరిగి మాతృ సంస్థకు పంపాలని నిబంధన ఉంది. ఈ లెక్కన నవీన్‌కు యాదగిరి గుట్ట ఆలయంలో డీఈవో పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అక్కడ ఇది వరకే డిప్యూటీ కార్యనిర్వహణ అధికారి ఉన్నందున తిరిగి అతడిని మాతృ సంస్థ వేములవాడకు పంపి పోస్టింగ్ ఇవ్వాలి. కానీ దేవాదాయ శాఖ పట్టించుకోకపోవడంతో పదోన్నతి పొందినా పాత ఉద్యోగమే చేస్తున్నాడు.

### మరికొందరిదీ అదే పరిస్థితి

యాదగిరిగుట్ట మాతృ సంస్థగా ఉన్న పర్యవేక్షకుడు అశోక్ వేములవాడకు బదిలీ అయ్యాడు. అయితే యాదగిరిగుట్టలో సహాయ కార్యనిర్వాహణ అధికారి పోస్టు ఖాళీ కాగా, సీనియారిటీ ప్రకారం అశోక్‌కు ఉద్యోగోన్నతి వచ్చింది. ప్రస్తుతం వేములవాడ పీఆర్వో కార్యాలయంలో పర్యవేక్షకుడిగా పని చేస్తున్న అశోక్‌కు, పదోన్నతి ప్రకారం ఇక్కడా పోస్టింగ్ ఇవ్వక, మాతృ సంస్థకు పంపించక పోవడంతో పాత ఉద్యోగమే చేస్తున్నాడు. అలాగే వేములవాడ మాతృ సంస్థగా ఉన్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, భూమి రెడ్డి సైతం కొండగట్టుకు బదిలీ అయి కొలువులు చేస్తున్నారు. అయితే చంద్రశేఖర్, భూమిరెడ్డికి సీనియారిటీ ప్రకారం వేములవాడలో పర్యవేక్షకులుగా ఉన్నతి వచ్చింది. వీరిద్దరిదీ ఇదే పరిస్థితి. ఇలా ఇటీవల బదిలీ అయిన వారి చాలా మందికి ఉద్యోగోన్నతి వచ్చినా పాత కొలువే చేస్తున్నారు. ఉద్యోగోన్నతి ఉద్యోగులకు ఆయా ఆలయాల్లో సముచిత స్థానం లేనప్పుడు తిరిగి మాతృ సంస్థకు పంపాలనే నిబంధన ఉండడం, ఈ విషయాన్ని ఆయా ఆలయాల ఉన్నతాధికారులు దేవాదాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో అధికారులు, ఉద్యోగులు నలిగిపోతున్నారు. సర్వీస్ రూల్స్ ప్రకారం వచ్చే బెనిఫిట్స్ నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

# సర్వే షురూ

- పరిశీలించిన కలెక్టర్లు



కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి లో ఎన్యుమరేటర్ల తో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష



చిగురుమామిడి : రేకొండలో ఓ ఇంటికి వేసిన స్టిక్కర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 6: కులగణన సర్వే నేటి నుంచి ప్రారంభమైంది. మూడు రోజులపాటు చేపట్టే ఇండ్ల జాబితా నమోదు (హౌస్ లిస్టింగ్) కార్యక్రమం బుధవారం మొదలైంది. ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయగా, మొదటి రోజు ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్, చిగురుమామిడి మండలం రేకొండ పరిధిలోని పెద్దమ్మపల్లెలో.. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ కొడిమ్యాలతోపాటు పూడూర్, మల్యాల మండలం రామన్నపేటలో.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో సర్వేను పరిశీలించారు. మూడు రోజుల పాటు హౌస్‌లిస్టింగ్ సర్వే చేస్తారని, ఈ నెల 9 నుంచి ప్రభుత్వం ముద్రించిన ఫార్మాట్‌లో కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించి నమోదు చేస్తారని చెప్పారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎటువంటి అపోహలు లేకుండా వివరాలు అందించాలని సూచించారు.